శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:50 సూర్యాస్తమయం - సా. 6:09 తిథిః సప్తమి రా. 2:32ం వరకు తరువాత అష్టమి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం అశ్విని రా. 9:50 వరకు తరువాత భరణి యోగం శుభ రా. 12:00ం వరకు కరణం గరజి మ. 3:34 వరకు వనిజ రా. 2:32ం వరకు వర్జ్యం సా. 6:03 నుండి రా. 7:33 వరకు దుర్ముహూర్తం ఉ. 9:06 నుండి ఉ. 9:51 వరకు రా. 11:13 నుండి రా. 12:04 వరకు రాహుకాలం మ. 3:19 నుండి సా. 4:44 వరకు యమగండం ఉ. 9:40 నుండి ఉ. 11:05 వరకు గుళికాకాలం మ. 12:30 నుండి మ. 1:54 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:14 నుండి ఉ. 6:02 వరకు అమృత ఘడియలు మ. 3:02 నుండి సా. 4:33 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:52 వరకు


e-paper

# ఈ -కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం


సందీప్ రెడ్డి వంగా చిత్రంలో సాయి పల్లవి.. కానీ..?



సినీ కబుర్లు


మంగళవారం | 4-2-2025 | హైదరాబాద్ | e-kaburu.com


## తెలుగు రాష్ట్రాల నుంచి మరిన్ని

# వందే భారత్ రైళ్లు

### తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కేటాయింపులపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటన




రైల్వేలకు కేటాయింపులతో కూడిన కేంద్ర బడ్జెట్‌ను 01 ఫిబ్రవరి 2025 న పార్లమెంట్‌లో సమర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర రైల్వే, సమాచార ప్రసార శాఖ, ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్, న్యూఢిల్లీ నుండి తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన కేటాయింపుల ముఖ్యాంశాలపై సోమవారం వర్చువల్‌గా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు.

- తెలంగాణకు రికార్డు స్థాయిలో రూ.5,337 కోట్ల రైల్వే బడ్జెట్
- 2009-14 సగటు కేటాయింపులతో పోలిస్తే ఆరు రెట్లు పెరుగుదల
- రైలు అభివృద్ధి ప్రాజెక్టులకు రూ.41,677 కోట్ల పెట్టుబడి
- తెలంగాణలో రైల్వే నెట్‌వర్క్ 100% విద్యుదీకరణ
- 1,465 కిలోమీటర్ల మేర కవచ్ వ్యవస్థ అమలు
- తెలంగాణలో 7 జిల్లాల్లో 9 స్టాప్‌లతో 5 వందే భారత్ రైళ్లు
- 40 రైల్వే స్టేషన్లు అమృత్ భారత్ పథకం కింద పునరాభివృద్ధి
- 50 కొత్త నమో భారత్ రైళ్లు, 200 వందే భారత్ రైళ్లు ఆమోదం
- 7,000 కిలోమీటర్ల పాత ట్రాక్ పునరుద్ధరణ ప్రణాళిక
- 160 కిమీ వేగంతో రైళ్ల నడిపేందుకు ట్రాక్ అప్‌గ్రేడ్ లక్ష్యం
- 130 కిమీ, 100 కిమీ వేగంతో నడిచే మార్గాల అభివృద్ధి

**ఈ-కబురు,న్యూఢిల్లీ**

ఫిబ్రవరి 03 : రైల్వేలకు కేటాయింపులతో కూడిన కేంద్ర బడ్జెట్‌ను 01 ఫిబ్రవరి 2025న పార్లమెంట్‌లో సమర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర రైల్వే, సమాచార ప్రసార శాఖ,ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్, న్యూఢిల్లీ నుండి తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన కేటాయింపుల ముఖ్యాంశాలపై సోమవారం వర్చువల్‌గా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు.

సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్,ఇతర సీనియర్ రైల్వే అధికారులు పాల్గొన్నారు.

### తెలంగాణ రాష్ట్రానికి రైల్వే బడ్జెట్ కేటాయింపులోని ముఖ్యాంశాలు:

ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ 2025-2026 సంవత్సరానికిగాను తెలంగాణ రాష్ట్రానికి రికార్డు స్థాయిలో రూ.5,337 కోట్ల బడ్జెట్ కేటాయింపులు మంజూరు అయ్యాయని తెలియజేశారు. 2009-14 సంవత్సరాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వార్షిక సగటు బడ్జెట్ వ్యయం రూ. 886 కోట్లు మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. తెలంగాణకు బడ్జెట్ కేటాయింపులు 2009-14 మధ్య కాలంలో ఉమ్మడి రాష్ట్రానికి జరిగిన సగటు కేటాయింపులతో పోలిస్తే దాదాపు ఆరు రెట్లు పెరిగిందని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ రైలు అభివృద్ధి ప్రాజెక్టుల కోసం రూ. 41,677 పెట్టుబడి పెడుతున్నట్లు గౌరవ మంత్రి పేర్కొన్నారు. తెలంగాణలో రైల్వే నెట్‌వర్క్ ఇప్పుడు 100% విద్యుదీకరణ చెందిందని మంత్రి తెలియజేశారు. కవచ్ ఏర్పాటులో తెలంగాణ ముందంజలో ఉందని, కవచ్ అభివృద్ధి కేంద్రం సికింద్రాబాద్‌లో ఉందని ఆయన పేర్కొన్నారు. (మిగతా 2 వ పేజీలో)



## తెలంగాణ కులగణనపై రాహుల్ గాంధీ


# సంచలన వ్యాఖ్యలు

- 90 శాతం జనాభా బీసీ, ఎస్సీ, ఎస్టీలేనని వెల్లడించిన రాహుల్
- కులగణన ద్వారా అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్య
- దేశవ్యాప్తంగా కులగణన చేయాలని రాహుల్ డిమాండ్
- బీజేపీలో బీసీ, ఎస్సీ, ఎస్టీ ఎంపీలకు అధికార హక్కుల్లేవని సెటైర్
- దేశంలో 50% బీసీలున్నా అధికారంలో ప్రాతినిధ్యం తక్కువ
- భారతదేశం ఉత్పత్తి రంగంలో విఫలమై చైనాకు అవకాశమిచ్చింది
- రాష్ట్రపతి ప్రసంగంలో కొత్త అంశాలు లేవని విమర్శ
- దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రమైందని రాహుల్ గాంధీ వ్యాఖ్య

తెలంగాణలో కులగణనపై లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో జరిపిన కులగణనలో షాకింగ్ విషయాలు వెల్లడయ్యాయన్నారు. 90 శాతం జనాభా బీసీ, ఎస్సీ, ఎస్టీలే ఉన్నారని తెలిపారు.


**ఈ-కబురు,న్యూఢిల్లీ**

ఫిబ్రవరి 03 : కేంద్ర బడ్జెట్ 2025-26పై చర్చ సందర్భంగా ఇవాళ లోక్‌సభలో మాట్లాడిన రాహుల్ గాంధీ కులగణనతోనే అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతాయన్నారు. దేశంలో కులగణన ఎందుకు చేయడంలేదని ప్రశ్నించారు. దేశంలో సగానికి పైగా మంది బీసీలే ఉన్నారని తెలిపారు. (మిగతా 2 వ పేజీలో)



టీ20లు సరే..
గంభీర్‌కు అసలు పరీక్ష
ఇప్పుడే!

ఆట



నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

బిజినెస్

## ఏఐ అంటే హైదరాబాద్ గుర్తుకు వచ్చేలా

# ఏఐ సిటీ నిర్మాణం



- తెలంగాణలో ఏఐ యూనివర్శిటీ ఏర్పాటు - మంత్రి శ్రీధర్ బాబు
- 200 ఎకరాల్లో ప్రతిష్టాత్మకంగా ఏఐ సిటీ నిర్మాణం
- ఏఐ రంగంలో తెలంగాణను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యం
- ఏఐ యూనివర్శిటీ నిర్వహణలో పరిశ్రమల భాగస్వామ్యం
- ఎమర్జింగ్ టెక్నాలజీల్లో పెట్టుబడులకు ప్రోత్సాహం
- హైదరాబాద్‌లో డీటీసీసీ రెండో కార్యాలయం ప్రారంభం
- 500 ఉద్యోగాలు త్వరలో - భవిష్యత్తులో 2,000 అవకాశాలు
- తెలంగాణ యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత
- తెలంగాణ పరిశ్రమలకు అనుకూల వాతావరణం

**ఈ-కబురు,హైదరాబాద్**

ఫిబ్రవరి 03 : తెలంగాణ యువతను 'కృత్రిమ మేధ'లో నిపుణులుగా తీర్దిదిద్దాలనే సంకల్పంతో ఏఐ సిటీలో ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. 200 ఎకరాల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏఐ సిటీని నిర్మించబోతున్నట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఏఐ అంటే తెలంగాణ.. (మిగతా 2 వ పేజీలో)



# ఎమ్మెల్యేల రహస్య భేటీ వాస్తవమే

### హైదరాబాద్ కోహినూర్ హెూటల్‌లో భేటీ నిజమే - మంత్రి పొన్నం

### ఎమ్మెల్యేలు సమావేశం అవ్వడం పార్టీ అంతర్గత అంశమే

### కేబినెట్ మంత్రి తీరుపై అసంతృప్తి కారణంగా భేటీ?

### కాంగ్రెస్ నేతలు భవిష్యత్ కార్యాచరణపై ఆలోచనలో

**ఈ-కబురు,హైదరాబాద్**

ఫిబ్రవరి 03 : పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల రహస్య భేటీపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు.ఎమ్మెల్యేల రహస్య భేటీ వాస్తవమేనని పొన్నం తెలిపారు.హైదరాబాద్ కోహినూర్ హెటల్‌లో భేటీ జరిగిందన్నారు.అయితే ఎమ్మెల్యేలు సమావేశం అవ్వొద్దా అంటూ ప్రశ్నించారు మంత్రి పొన్నం. (మిగతా 2 వ పేజీలో)



# హైదరాబాద్‌లో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఆలోచన ఉందా లేదా?

### లోక్ సభలో ఈటల ప్రశ్న

### తెలంగాణలో లైవ్ స్టాక్ పథకాలు నిర్లక్ష్యం

### కేంద్రం జోక్యం చేసుకోవాలని ఈటల డిమాండ్

### కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే లైవ్ స్టాక్ పథకాల అమలు

### 2047 వికసిత్ భారత్ లక్ష్యం - మోదీ ప్రయత్నం

**ఈ-కబురు,న్యూఢిల్లీ**

ఫిబ్రవరి 03 : హైదరాబాద్‌లో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఆలోచన ఉందా లేదా? లోక్ సభలో ఈటల ప్రశ్న అగ్రికల్చర్, డైరీ లాంటి లైవ్ స్టాక్ పథకాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కోరారు. లైవ్ స్టాక్ పథకాలు కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే అమలు చేస్తున్నాయని గుర్తు చేశారు. లోక్ సభలో ఇవాళ ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడిన ఈటల రాజేందర్ భారతదేశంలో యువశక్తి చాలా ఎక్కువ ఉందని ఐటీ, (మిగతా 2 వ పేజీలో)

# బిల్డర్ వేణుగోపాల్ రెడ్డి ఆత్మహత్య ముమ్మాటికి ప్రభుత్వ హత్యే

## మాజీమంత్రి హరీష్ రావు,





**ఈ-కబురు,మేడ్చల్ మల్కాజిగిరి**

ఫిబ్రవరి 03 : హైడ్రా ఏర్పాటు రియల్ ఎస్టేట్ రంగం కుదేలు తో అప్పుల పాల్కెన కొంపల్లికి చెందిన బిల్డర్ వేణుగోపాల్ రెడ్డి ఆత్మహత్యకు పాల్పడగా, మాజీ మంత్రివర్యులు హరీష్ రావు , కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, కొంపల్లిలోని వేణుగోపాల్ రెడ్డి నివాసంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వర్యులు హరీష్ రావు, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ తో ఆత్మహత్యకు పాల్పడిన బిల్డర్ వేణుగోపాల్ రెడ్డి కుటుంబ సభ్యులతో కాంగ్రెస్ పాలన, కుదేల్కెన రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ఇంట్లో చర్చించిన విషయాలను హరీష్ రావుకి తెలియజేశారు. మార్పు కోసం నేను కాంగ్రెస్ కు ఓటు వేసి ఆగమయ్యారు. నా ఓటు వృధాగా పోయిందని బాధగా ఉంది. గతంలో బిల్డర్ లాంటి బ్యాంకర్లు మేము ఇస్తామేమిస్తామంటూ లోన్లకు ఎగబడేవారు, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన హైడ్రా తో నిజాయితీగా లేఅవుట్లు వేసిన మనలాంటి బిల్డర్ల వైపు, మన వెంచర్ల వైపు కొనుగోలు దారులు అనుమానంగా చూస్తున్నారు. ప్లాట్లు కొనాలంటే ఎందుకో ఇబ్బంది పడుతున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రియల్ ఎస్టేట్ వ్యాపారం మంచిగా సాగింది, మార్పు మార్పు అంటూ కాంగ్రెసుకు ఓటు వేసి ఆగమయ్యాం.

అనంతరం విలేకరుల సమావేశంలో మాజీ మంత్రివర్యులు హరీష్ రావు, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ. బిల్డర్ వేణుగోపాల్ రెడ్డి ఆత్మహత్య ప్రభుత్వ హత్యేనని, ప్రభుత్వ అసమర్థ పాలన అనాలోచిత నిర్ణయాలతోనే రాష్ట్రంలో రియల్టర్ల, బిల్డర్ల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. పిల్లల పెళ్లిళ్ల కోసం చదువుల కోసం ఆపదలో ఉన్న వారు అమ్ముకుందామంటే ప్లాట్లు అమ్ముడుపోని దుస్థితి నెలకొంది.గత పదేళ్ల కాలంలో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ రియల్ ఎస్టేట్ రంగంలో దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా, విదేశీ సంస్థలు పెట్టుబడులు పెట్టేలా హైదరాబాద్ ను పెట్టుబడులకు స్వర్గధామంగా మారిస్తే, నేడు కాంగ్రెస్ పాలకులు మాత్రం వారి అనాలోచిత నిర్ణయాలతో ప్రజలను భయపెట్టే విధంగా హైడ్రాను ఏర్పాటుచేసి పెట్టుబడులు ముంబై, నోయిడా, బెంగుళూరు వంటి ప్రాంతాలకు తరలిపోయే విధంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజార్చారు. బిల్డర్ వేణుగోపాల్ రెడ్డి ఆత్మహత్యతో వారి కుటుంబ సభ్యులు దిక్కుతోచని పరిస్థితిలో ఉంటే ప్రభుత్వం కానీ, బిల్డర్ అసోసియేషన్ సభ్యులు ఎవరు వేణుగోపాల్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించకపోవడం బాధాకరం. రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ అంటే నాకు బాగా తెలుసు అని మాటల్లో చెప్పడం కాదు, మీరు వచ్చి వేణుగోపాల్ రెడ్డి కుటుంబంతో మాట్లాడండి, వారి కష్టాన్ని అర్థం చేసుకోండి, భవిష్యత్తులో మిగతా బిల్డర్లకు ఈ పరిస్థితి రాకుండా చర్యలు చేపట్టండి. బడా బడా బిల్డర్ లతో సమావేశాలు నిర్వహించి రియల్ ఎస్టేట్ అంతా బాగానే ఉందని చెప్పడం కాదు, చిన్నచిన్న బిల్డర్ లతో మాట్లాడండి. రికార్డ్ తే గాని డొక్కాడని బిల్డర్లు ఎంతోమంది రాష్ట్రంలో ఉన్నారు. హెచ్ఎండిఏ, జీహెచ్ఎంసీ పరిధిలో ఆలస్యం ఎందుకు అవుతుంది.లంచాల పేరిట వేదింపులు ఎందుకు ఎక్కువవుతున్నాయి.

ఎందుకు రాష్ట్రంలో ఈ పరిస్థితి నెలకొంది. మున్సిపల్ శాఖ మంత్రిగా మీరే ఉన్నారు. రియల్ ఎస్టేట్ రంగంపై సమీక్షా సమావేశం నిర్వహించండి. బిల్డర్ వేణుగోపాల్ రెడ్డి కుటుంబానికి మా బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.



# ఎమ్మెల్యేల రహస్య భేటీ వాస్తవమే

(మొదటి పేజీ తరువాయి)

మీడియాతో చిట్‌చాట్‌లో భాగంగా ఎమ్మెల్యేల రహస్య భేటీపై తనదైన శైలిలో స్పందించారు పొన్నం. ఎవరి హక్కుల కోసం వాళ్లు పోరాటాలు చేస్తారని, ఎమ్మెల్యేల భేటీ అనేది తమ పార్టీ అంతర్గత అంశమన్నారు మంత్రి పొన్నం.

కాగా, రెండు రోజుల క్రితం కొంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రహస్యంగా భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఓ కేబినెట్ మంత్రి వ్యవహరిస్తున్న తీరుపై వీరు అసంతృప్తిగా ఉన్నారనే చర్చ నడిచింది. ఈ నేపథ్యంలోనే భవిష్యత్ కార్యాచరణపై ఎమ్మెల్యేలు రహస్యంగా భేటీ అయ్యారనే వార్తలు వచ్చాయి,.మరోవైపు.. సోషల్ మీడియాలో కాంగ్రెస్ నేతలు పెట్టిన పోల్ అంశం కూడా తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ట్విట్టర్ వేదికగా కాంగ్రెస్ పెట్టిన పోల్.. ప్రభుత్వానికి షాక్ ఇచ్చింది. 70 శాతం బీఆర్ఎస్‌కు అనుకూలంగా, 30 శాతం కాంగ్రెస్‌కు ఫేవర్‌గా ఓట్లు పడ్డాయి. ఈ క్రమంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోల్ రావడం హస్తం నేతలకు మింగుడు పడటం లేదని సమాచారం. ఈ నేపథ్యంలో కొందరు కాంగ్రెస్ నేతలు దిక్కులు చూస్తున్నారనే చర్చ సైతం నడుస్తోంది.తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విరుచుకుపడిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో జరుగుతున్న విషయాలను నేను గంభీరంగా, మౌనంగా చూస్తున్నా.. నాకు కొడితే వట్టిగా కొట్టుడు అలవాటు లేదు. నాలుగు రోజులు కానీయ్ అన్నట్లు చూస్తున్నా. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయింది. కాంగ్రెస్ మెడలు వంచి భవిష్యత్తు కోసం కొట్లాడాలి. అలాగే, ప్రాణం పోయినా సరే తెలంగాణకు రక్షకులం మనమే. తెలంగాణ హక్కుల కోసం తెగించి కొట్లాడాల్సిందే అని కామెంట్స్ చేశారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించు కున్నాయి. దీంతో, హస్తం నేతలు బీఆర్ఎస్ పంచన చేరే అవకాశాలు సైతం ఉన్నట్టు వార్తలు చక్కర్లు కొట్టాయి. ప్రస్తుతానికి ఎమ్మెల్యే రహస్య భేటీని కాంగ్రెస్ పార్టీ తమ అంతర్గత అంశమని పైకి చెబుతున్నా.. లోలోపల మాత్రం ఆలోచనలో పడినట్లే కనిపిస్తోంది. మరి కాంగ్రెస్ ఎమ్మెల్యేల రహస్య భేటీ ఏ టర్న్ తీసుకుంటుందో అనేది వేచి చూడాలి.



## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత కోరుతూ

# సుప్రీంకోర్టుకు కేటీఆర్

- కేటీఆర్ పిటిషన్‌పై సుప్రీం కోర్టులో విచారణ
- పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హతపై తీర్పు కోరుతూ పిటిషన్
- కేటీఆర్ పిటిషన్‌ను పాత కేసుతో కలిపిన ధర్మాసనం
- తదుపరి విచారణ ఫిబ్రవరి 10కి వాయిదా
- తెలంగాణ స్పీకర్ నిర్ణయంపై సుప్రీం కోర్టు ఆగ్రహం

**ఈ-కబురు,హైదరాబాద్**

ఫిబ్రవరి 03 : కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. బీఆర్ఎస్ తరఫున సీనియర్ న్యాయవాది ఆర్య రామసుందరం వాదనలు వినిపించారు. తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. బీఆర్ఎస్ తరఫున సీనియర్ న్యాయవాది ఆర్య రామసుందరం వాదనలు వినిపించారు.ఇదే వ్యవహారంపై గతంలో దాఖలైన పిటిషన్‌కు కేటీఆర్ వేసిన పిటిషన్‌ను ధర్మాసనం జతచేసింది. కేటీఆర్ వేసిన పిటిషన్‌ను.. దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు అనర్హత పిటిషన్‌తో కలిపి విచారిస్తామని సుప్రీం ధర్మాసనం స్పష్టంచేసింది. పాత పిటిషన్‌తో కలిపి కేటీఆర్ పిటిషన్‌పై విచారణ చేస్తామని చెబుతూ తదుపరి విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 10కి వాయిదా వేసింది.

పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వేసిన పిటిషన్‌పై రెండు రోజుల క్రితం సుప్రీంలో విచారణ జరుగగా.. సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. తెలంగాణ స్పీకర్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవడంలో తెలంగాణ స్పీకర్ ఆలస్యం చేయడాన్ని తప్పుపట్టింది. ఇంకా ఎంత సమయం కావాలంటూ గత విచారణలో గట్టిగా ప్రశ్నించింది.బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవడానికి మీ దృష్టిలో తగిన సమయం అంటే ఎంత.. మహారాష్ట్ర తరహాలో శాసనసభ గడువు ముగిసేదాకనా అని క్వశ్చన్ చేసింది. స్పీకర్‌కు ఎంత సమయం కావాలో మీరే కనుక్కుని చెప్పాలంటూ న్యాయవాది ముకుల్ రోహత్గీని ఆదేశించింది. ఆపై తదుపరి విచారణను వాయిదా వేసింది.

# హైదరాబాద్‌లో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఆలోచన ఉందా లేదా?

(మొదటి పేజీ తరువాయి)

మ్యానిఫాక్చర్, సర్వీస్ పనిచేసేవారికి నాణ్యతతో కూడిన శిక్షణ ఇవ్వడానికి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే ఆలోచన ఉందా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విదేశాలకు వెళ్లే పిల్లలకు భారత ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు ఏంటి? పాస్ పోర్టు తీసుకున్న దగ్గరినుండి వీసా ఇప్పించడం, మంచి కంపెనీలలో ఉద్యోగం ఇప్పించడం వరకు ప్రభుత్వం సాంకేతిక సహకారం అందించాలి. విదేశాలకు వెళ్లే విద్యార్థులు ధ్రువీకరణ లేని కంపెనీలలో ఉద్యోగాలు చేస్తూ జైలుపాలు కాకుండా చూసేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు వివరించాలని కోరారు.




2047 వికసిత్ భారత్ కోసం ప్రధాని మోడీ ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకు యువతకు అవసరమైన లోన్లు బ్యాంకులు ఇవ్వడానికి ఇబ్బందులు లేకుండా చేయడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందని ప్రశ్నించారు.

## తెలుగు రాష్ట్రాల నుంచి మరిన్ని

# వందే భారత్ రైళ్లు

(మొదటి పేజీ తరువాయి)



ప్రస్తుతం, దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని వివిధ విభాగాలలో 1,465 కిలోమీటర్ల మేర కవచ్ వ్యవస్థ ఏర్పాటుచేయబడింది. కవచ్ తాజా వెర్షన్ 4.0 ఏర్పాటుకు ట్రయల్స్ జరుగుతున్నాయని ఆయన అన్నారు. రాబోయే 6 సంవత్సరాలలో దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం రైలు నెట్‌వర్క్‌లో కవచ్‌ను ఏర్పాటుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో 7 జిల్లాల గుండా తొమ్మిది స్టాప్‌లతో 5 వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. ఇంకా, అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద తెలంగాణలోని 40 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. 50 కొత్త నమో భారత్ రైళ్లు, 200 వందే భారత్ రైళ్లు మరియు 100 కొత్త అమృత్ భారత్ రైళ్లకు ఆమోదం లభించిందని, ఈ రైళ్ల రాకపోకలను ఎప్పటికప్పుడు ప్రకటిస్తామని ఆయన ప్రకటించారు. రైల్వేలు7,000 కిలోమీటర్ల మేర పాత ట్రాక్‌లను పునరుద్ధరించాలనే లక్ష్యాన్ని చేపట్టాయని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమైన విభాగాలలో 160 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడపడానికి భారతీయ రైల్వేలు రైల్వే ట్రాక్‌లను అప్‌గ్రేడ్ చేయాలని యోచిస్తున్నాయని తెలిపారు. అదేవిధంగా, కొన్ని మార్గాలు 130 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడపగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని ,మొత్తం నెట్‌వర్క్ 100 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడపగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని పేర్కొన్నారు.

## తెలంగాణ కులగణనపై రాహుల్ గాంధీ

# సంచలన వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)



దేశ అభివృద్ధి కోసం కొత్త నమూనాలు ఏది తీసుకువచ్చినా అది కులగణన ఫలితాలతోనే సాధ్యం అవుతాయని పేర్కొన్నారు. బీజేపీలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఎంపీలు ఒకటి గుర్తుపెట్టుకోవాలని, 'దేశ జనాభాలో 50 శాతం ఉన్నా మీకు అధికారం లేదు. మీరు అధికార పక్షంలో కూర్చున్నా మీరు కనీసం నోరు మెదపని పరిస్థితి' ఉందని, ఇది దేశంలోని రియాల్టీ అని చెప్పారు.

### యూపీఏ, ఎన్డీయే రెండూ విఫలం..

దేశంలోని నిరుద్యోగ సమస్యకు యూపీఏ, ఎన్డీయే ప్రభుత్వాలు సరైన పరిష్కారం చూపించలేకపోయాయని రాహుల్ గాంధీ అన్నారు. ఉత్పత్తి ఆధారిత దేశంలో మనం విఫలమై దాన్ని చైనాకు అప్పగించామని, ఇకనైనా ఉత్పత్తిపైనే పూర్తిగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రపతి ప్రసంగంలో కొత్త విషయాలేమి లేవని మేకిన్ ఇండియా వల్ల దేశంలో ఎలాంటి మార్పు రాలేదని రాహుల్ పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లు ఇక్కడే తయారవుతున్నాయి కానీ అవి మేడిన్ ఇండియా కాదన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య వెంటాడుతోందని అన్నారు.

## ఏఐ అంటే హైదరాబాద్ గుర్తుకు వచ్చేలా

# ఏఐ సిటీ నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)



హైదరాబాద్ గుర్తుకు వచ్చేలా దాన్ని తీర్చి దిద్దుతామన్నారు. ఈ వర్సిటీ నిర్వహణలో సంబంధిత పరిశ్రమలు, నిపుణులను భాగస్వామ్యం చేస్తామన్నారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా ప్రోత్సహిస్తామన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సేవలు అందిస్తోన్న డిపాజిటరీ ట్రస్ట్, క్లియరింగ్ కార్పొరేషన్(డీటీసీసీ) నూతన కార్యాలయాన్ని శ్రీధర్‌బాబు ప్రారంభించారు. డీటీసీసీ.. భారత్‌లో తన రెండో కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించినందుకు శ్రీధర్ బాబు సంతోషం వ్యక్తం చేశారు. ఇక్కడ సుమారు 500 మందికి కొత్తగా ఉద్యోగావకాశాలు రానున్నాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో 2వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయని చెప్పారు. వీటిలో అధిక శాతం తెలంగాణ యువతకు ఇవ్వాలని కోరగా అందుకు యాజమాన్యం అంగీకరించినట్లు శ్రీధర్ బాబు తెలిపారు.ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. "యువత వినూత్నంగా ఆలోచించాలి. నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి. ఆ దిశగా కృషి చేసే వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. హైదరాబాద్ అనగానే అందరికీ కేవలం సాఫ్ట్‌వేర్ కంపెనీలే గుర్తుకొస్తాయి. కానీ.. ఇక్కడ అన్ని రంగాలకు చెందిన కంపెనీలున్నాయి. 100 నుంచి 120 కంపెనీలు హైదరాబాద్ నుంచే ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సేవలందిస్తున్నాయి. అన్ని రకాల పరిశ్రమలను స్థాపించేందుకు అనువైన వాతావరణం తెలంగాణలో ఉంది. పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యమున్న మానవ వనరులను మేం అందిస్తాం. నిశ్చింతగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టొచ్చు" అని శ్రీధర్‌బాబు తెలిపారు.





## 7వ తేదీన లక్ష డప్పులు, వేల గొంతులు

# విజయవంతం చేద్దాం..

### సిద్దిక్ నగర్‌లో డప్పులు వాయించి ప్రదర్శన చేసిన ఎమ్ఆర్పీఎస్ నాయకులు

ఈ-కబురు, శేరిలింగంపల్లి : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో మంద కృష్ణమాదిగ నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు.. వేల గొంతుల కార్యక్రమానికి వేలాదిగా తరలిరావాలని ఆ సంఘ రంగారెడ్డి జిల్లా నాయకులు అన్నారు. సోమవారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని సిద్దిక్ నగర్ లో లక్ష డప్పులు, వేల గొంతుల కార్యక్రమంలో భాగంగా డప్పుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంద కృష్ణమాదిగకు పద్మ శ్రీ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. వర్గీకరణ సాధన కోసం భారీగా చేపట్టిన లక్ష డప్పులు, వేల గొంతులు కార్యక్రమం ఎమ్మార్పీఎస్ పోరాట ఉద్యమంలో మరోసారి చరిత్రలో చిరస్థాయిగా నిలవబోతుందని చెప్పారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్ఆర్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, మేడి పాపన్నల ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి నుంచి భారీ ఎత్తున లక్ష డప్పులు, వేల గొంతులు కార్యక్రమానికి తరలివెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రవికుమార్ మాదిగ, యాదయ్య మాదిగ, శేరిలింగంపల్లి ఇంచార్జ్ శంకర్ మాదిగ, రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ చందు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## టీజీ ఎప్‌సెట్, ఐసెట్, పీజీ ఈసెట్‌లకు

# షెడ్యూల్ విడుదల..


**ఈ-కబురు,హైదరాబాద్**

ఫిబ్రవరి 03 : తెలంగాణలో ఉమ్మడి ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను ఉన్నత విద్యా మండలి ఇప్పటికే వెల్లడించింది. వీటిలో భాగంగా ఏప్రిల్ 29 నుంచి మే 5 వరకు ఎప్‌సెట్ నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 22 నుంచి ఎప్‌సెట్ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు సోమవారం(ఫిబ్రవరి3) ఉన్నత విద్యామండలి ప్రకటించింది.

ఏప్రిల్ 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు జరగనున్నాయి. మే 2 నుంచి 5 వరకు ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం పరీక్ష జరగనుంది. ఎప్‌సెట్ పరీక్షలు జేఎన్‌టీయూ నిర్వహిస్తోంది.

### పీజీ ఈసెట్ షెడ్యూల్ ఖరారు..

తెలంగాణ పీజీ ఈసెట్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యా మండలి ప్రకటించింది. మార్చి 12న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.మార్చి 17 నుంచి 19 వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.జూన్ 16 నుంచి 19 వరకు పరీక్షలు జరగనున్నాయి.కాగా, ఈ ఏడాది నిర్వహించనున్న అన్ని కామన్ ఎంట్రన్స్ పరీక్ష(సెట్)ల తేదీలను ఇప్పటికే రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఖరారు చేసింది. ఒకటి కంటే ఎక్కువ పరీక్షలు రాసే వారికి ఇబ్బంది రాకుండా సెట్ పరీక్షల తేదీలను వేర్వేరు రోజుల్లో ఖరారు చేశారు.






# వినువీధి నుంచి చంద్ర గ్రహణ వీక్షణం

## కెమెరాలో బంధించిన బ్లూ ఘోస్ట్ ల్యాండర్

**ఈ-కబురు,టెక్సాస్**

ఫిబ్రవరి 03 : చంద్రగ్రహణాన్ని భూమి నుంచి చూశారు. అయితే అత్యంత దగ్గరగా, అది కూడా ఆకాశం నుంచి చూశారా? లేదు కదా. అయితే వచ్చే నెలలో చంద్రునిపై దిగనున్న బ్లూ ఘోస్ట్ ల్యాండర్ చంద్రగ్రహణాన్ని అత్యంత సమీపం నుంచి చూపించి అబ్బురపరిచింది. అది తాజాగా తీసిన చంద్రగ్రహణం ఫొటోలను జతకూర్చి వీడియోగా కూర్చి ల్యాండర్ తయారీదారు ఫైర్‌ఫ్లై ఏరోస్పేస్ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేసింది. ఈ వీడియో తెగ వైరలవుతోంది. ల్యాండర్ ప్రస్తుతం అంతరిక్షంలో భూ సమీప కక్ష్యలో పరిభ్రమిస్తోంది. ఈ క్రమంలోనే చంద్రగ్రహణం ఫొటోలను తన 6.6 అడుగుల ఎత్తయిన డెక్ నుంచి కెమెరాలో బంధించింది. సూర్యకిరణాల వల్ల ఏర్పడిన తన నీడతో భూమి చంద్రుడిని కప్పేస్తున్న దృశ్యాలు ఆ వీడియోలో కనువిందు చేస్తున్నాయి. చంద్రునిపై నాసా పరిశోధనలకు పరికరాలను మోసుకెళ్లేందుకు 'కమర్షియల్ లూనార్ పేలోడ్ సర్వీసెస్' ప్రాజెక్టులో భాగంగా జనవరి 15న అమెరికాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి బ్లూ ఘోస్ట్ ల్యాండర్‌ను ప్రయోగించారు.



## ఆస్ట్రేలియాను ముంచెత్తిన

# వరదలు

**ఈ-కబురు,కాన్‌బెర్రా**

ఫిబ్రవరి 03 : ఆస్ట్రేలియాలోని క్వీన్స్ ల్యాండ్‌ను వరదలు ముంచెత్తాయి.అవి ముంచెత్తడంతో వేలాది మంది ఇళ్లను వదిలి పారిపోయారు.సోమవారం రికార్డు స్థాయిలో వర్షాలు కురిసే అవకాశం ఉందని, వరద నీరు రెండో అంతస్తు స్థాయికి పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. వరదలతో టౌన్స్ విల్లే, పర్యాటక కేంద్రమయిన కెయిర్న్స్ మధ్య రహదారులు తెగిపోయాయి.ఉత్తర క్వీన్స్ ల్యాండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో 700 మిల్లీ మీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. వరదలతో హెర్బర్ట్ నది నీటిమట్టం 15.2 మీటర్లకు చేరుకుంది. కుండపోత వర్షాలు, ఈదురు గాలులు మరింత ఆకస్మిక వరదలకు దారితీసే అవకాశం ఉందని బ్యూరో హెచ్చరించింది. సుమారు 200,000 మంది జనాభా ఉన్న టౌన్స్‌విల్లే నగరంలో గత 60 ఏళ్లలో ఎన్నడూ లేనంత భారీ వరదలు వచ్చాయని క్వీన్స్‌ల్యాండ్ ప్రీమియర్ డేవిడ్ క్రిసపుల్లీ తెలిపారు.


# నగర సమస్యలపై ప్రత్యేక దృష్టి

### మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ

ఈ-కబురు, శేరిలింగంపల్లి నగర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. నగరంలో పలు వార్డులో సమస్యలు తెలుసుకొని అక్కడిక్కడే పరిష్కరించేందుకు గ్రేటర్ పరిధిలోని పలు జోన్లలో ఆయా విభాగాల ఉన్నతాధికారులతో పాటు సంబంధిత కార్పొరేటర్లతో కలిసి పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని చందానగర్ సర్కిల్ హఫీజ్ పేట్ లో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ విజయ లక్ష్మి మాట్లాడుతూ ఇప్పటి వరకు సుమారు 15 వార్డుల్లో పర్యటించి వివిధ సమస్యలతో పాటు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం జిహెచ్ఎంసికి ఆర్థిక ఇబ్బందులు లేకుండా నిధులు మంజూరు చేస్తున్న నేపథ్యంలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.



హఫీజ్ పేట్ లోని పలు కాలనీలలో పర్యటించి శానిటేషన్, కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మేయర్ ఆర్టీసీ కాలనీలో శానిటేషన్, కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని, రోడ్డు వెడల్పు, వరద నీటి కాలువ, పార్కు అభివృద్ధికి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నలగండ్ల చెరువులో సి అండ్ వేస్ట్ తొలగింపుకు చర్యలు తీసుకోవాలన్నారు. చెరువు అభివృద్ధిని సిఎస్ఆర్ పద్ధతిలో చేస్తున్న నేపథ్యంలో రాంకీ వాళ్ళు వ్యర్థాలను తీసుకొని పోవడం లేదని, అందుకు వెంటనే రాంకీ ప్రతినిధులతో మాట్లాడి వ్యర్థాల తొలగింపుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నవోదయ కాలనీలో సివరేజ్ వాటర్, సెంట్రల్ యూనివర్సిటీ నుండి వరద నివారణకు చేపట్టే పనులను మేయర్ పరిశీలించారు.మేయర్ తో పాటు కార్పొరేటర్లు పూజిత జగదీశ్వర్ గౌడ్, జగదీశ్వర్ గౌడ్, జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, సిఈ భాస్కర్ రెడ్డి, జోనల్ ఎస్ఈ శంకర్ నాయక్, డిసి ముకుంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ప్రీజం పబ్ కాల్పుల కేసులో బత్తుల ప్రభాకర్ స్నేహితుల విచారణ

ఈ-కబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలి ఐటీ కారిడార్ లో ఉన్న ప్రీజం పబ్ వద్ద పట్టుకునేందుకు వెళ్లిన పోలీసులపై కాల్పులు జరిపిన బత్తుల ప్రభాకర్ స్నేహితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ప్రీజం పబ్ కాల్పుల ఘటన సమయంలో ప్రభాకర్ ఇద్దరు స్నేహితులు అక్కడి నుంచి పారిపోయినట్లు తెలుసుకున్న గచ్చిబౌలి పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని వివరాలు ఆరా తీస్తున్నారు. శనివారం సీసీఎస్ పోలీసులపై కాల్పులు జరిపిన మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ బత్తుల ప్రభాకర్ ఉదంతం సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. గత కొన్ని సంవత్సరాలుగా దొంగతనాలు, దోపిడీలు చేసి పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్న మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ బత్తుల ప్రభాకర్‌ను అరెస్టు చేసేందుకు మాదాపూర్ సిసిఎస్ పోలీసులు ప్రీజం పబ్ కు వెళ్లగా, పోలీసులపై బత్తుల ప్రభాకర్ కాల్పులు జరిపాడు.ఈ కాల్పుల్లో సిసిఎస్ మాదాపూర్ హెడ్ కానిస్టేబుల్ వెంకట్ రెడ్డి పాదం నుంచి బుల్లెట్ దూసుకువెళ్లి గాయపడ్డాడు. కాల్పుల అనంతరం మిగిలిన పోలీసులు, పబ్ బౌన్సర్లు కలిసి బత్తుల ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకోగా, గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. కాగా కాల్పులకు ముందు స్కోడా కారులో పబ్ వద్ద డ్రాప్ చేసిన స్నేహితుడు రంజిత్, మరో యువకుడు రోహిత్ లను గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాల్పుల అనంతరం వీరు ఇద్దరు ప్రీజం పబ్ వద్ద నుంచి పారిపోయినట్లు పోలీసులు తెలుసుకున్నారు. వీరిని బత్తుల ప్రభాకర్ ఏ విధంగా ఉపయోగించుకున్నాడు.. తాను చేసిన చోరీలలో వీరిని భాగస్వాములను చేశాడా అనే విషయాలపై వీరిని విచారిస్తున్నారు. వీరితో పాటు మిగిలిన స్నేహితుల వివరాలు సేకరిస్తున్నారు. కాల్పులు జరిగిన ప్రీజం పబ్ తో పాటు స్కోడా కారు సర్వీసింగ్ సెంటర్, నార్సింగిలోని ప్రభాకర్ నివాసం ఉంటున్న పరిసరాలు, ఐటి కారిడార్ పరిధిలోని పలు పబ్ ల వద్ద ఉన్న సిసి కెమెరాలను సైతం పోలీసులు పరిశీలిస్తున్నారు.



# అమెరికా సుంకాలకు కారణాలు...

అమెరికా 'కంట్రీఫస్ట్' విధానంతో ముందుకెళ్తోంది. అందులో భాగంగా కెనడా, మెక్సికో, చైనా దిగుమతులపై సుంకాలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. అమెరికా విధించిన సుంకాలను భారత్ కూడా ఎదుర్కొనే అవకాశం ఉందని తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. ఈ వాణిజ్య సంఘర్షణ భారతీయ విధానకర్తలు, వ్యాపారుల్లో ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఇప్పటికే అమెరికా కెనడా, మెక్సికో దేశాలపై 25 శాతం, చైనాపై 10 శాతం సుంకాలు విధించింది. ఈ సెగ భారత్‌కు సైతం తాకనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# భారత్‌పై ప్రభావం

అమెరికా, భారతదేశం చాలా సంవత్సరాలుగా సంక్లిష్టమైన వాణిజ్య సంబంధాన్ని కలిగి ఉన్నాయి. ఇరు దేశాల మధ్య కొన్ని అంశాలపై సహకారం ఉన్నా, కొన్నింటిపై వివాదాలున్నాయి. ఇటీవల ప్రపంచ వాణిజ్య సంస్థ లో ఇరు దేశాలు ఆరు దీర్ఘకాలిక వివాదాలను పరిష్కరించుకున్నాయి. ఇది ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి సానుకూల చర్యగా ఇరు వర్గాలు అభివర్ణించాయి. ఏదేమైనా, కొత్త సుంకాల భయం ప్రస్తుతం కీలకంగా మారుతుంది.

**టారిఫ్ భయాలకు కారణాలు**

ముఖ్యంగా ఫార్మాస్యూటికల్స్, టెక్స్‌టైల్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వంటి రంగాల్లో భారత్‌తో వాణిజ్య లోటుపై అమెరికా గళమెత్తింది. ఈ అసమతుల్యతలను పరిష్కరించడానికి, దేశీయ పరిశ్రమలను రక్షించడానికి సుంకాలను ఒక మార్గంగా చూస్తుంది. సుంకాలు విధించాలన్న అమెరికా నిర్ణయంలో ముఖ్యంగా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. భారత విదేశాంగ విధానాన్ని ప్రభావితం చేసే విస్తృత వ్యూహంలో భాగంగా అమెరికా ఆర్థిక ఒత్తిడి తీసుకురావాలని చూస్తోంది. విదేశీ పోటీ నుంచి దేశీయ పరిశ్రమలను రక్షించడానికి సుంకాలు అనుకూలమైన సాధనంగా అమెరికా పరిగణిస్తుంది. యూఎస్ ఆర్థిక ప్రయోజనాలకు ముప్పు పొంచి ఉందని భావిస్తే టారిఫ్‌ల విధానం భారత్‌కు విస్తరించే అవకాశం ఉంది.

**యూఎస్ సుంకాలు భారత్‌పై ప్రభావం**

ఎగుమతుల క్షీణత: భారత ఎగుమతిదారులు, ముఖ్యంగా సుంకాల ద్వారా లక్ష్యంగా చేసుకున్న రంగాల్లో మార్కెట్ అవకాశాలు తగ్గడం, ఆదాయాలు క్షీణించడం వంటి ఇబ్బందులు ఎదుర్కోవచ్చు. ఇది ఆ రంగాల్లో ఉపాధి, ఆర్థిక వృద్ధిపై ప్రభావం చూపుతుంది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు: దిగుమతి చేసుకున్న వస్తువులపై అధిక సుంకాలు భారతీయ వినియోగదారులకు ఖర్చులు పెరగడానికి దారితీస్తాయి. ఇది దేశంలో ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు దోహదం చేస్తుంది.

వాణిజ్య సంబంధాలు: టారిఫ్‌ల విధింపు ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను దెబ్బతీస్తుంది. ఇది ప్రతీకార చర్యలకు దారితీస్తుంది. రెండు ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీసే వాణిజ్య యుద్ధానికి తెరతీసే అవకాశం ఉంది.

**ఇప్పుడేం చేయాలంటే..**

సుంకాల ప్రభావాన్ని తగ్గించడానికి, దానివల్ల ఏర్పడే సమస్యలను పరిష్కరించడానికి భారత్, అమెరికా పరస్పర ప్రయోజనకరమైన విధానాలు అన్వేషించాలి. అందుకు ఇరు దేశాల మధ్య దౌత్య చర్చలు జరగాలని నిపుణులు సూచిస్తున్నారు. భారత్ ఇతర దేశాలతో వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకోవడం, ఎగుమతి మార్కెట్లను వైవిధ్యపరచడం కూడా అమెరికా మార్కెట్‌పై ఆధారపడటాన్ని తగ్గించేందుకు తోడ్పడుతుంది.

## నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

సోమవారం ఉదయం నష్టాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ ముగిసే సమయానికి నష్టాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 319.22 పాయింట్లు లేదా 0.41 శాతం నష్టంతో.. 77,186.74 వద్ద, నిఫ్టీ 122.85 పాయింట్లు లేదా 0.52 శాతం నష్టంతో 23,359.30 వద్ద ఉన్నాయి. బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, విప్రో, శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరాయి. లార్సెన్ %డ% టూబ్రో, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ , టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, కోల్ ఇండియా, భారత్ ఎలక్ట్రానిక్స్ వంటి కంపెనీలు నష్టాలను చవి చూశాయి.





## ఫిబ్రవరి 7న ఏం జరగనుంది?..

# అందరూ వెయిటింగ్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ 2025లో కొత్త పన్ను విధానం కింద రూ.12 లక్షల లోపు వార్షికాదాయం ఉన్న వ్యక్తులు ఎలాంటి ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అంతే కాకుండా సీనియర్ సిటిజన్లకు %ఱూ% మినహాయింపు రూ. 50వేల నుంచి రూ. 1లక్షకు పెంచారు. ఇక త్వరలోనే రిజర్వ్ బ్యాంక్ కీలక వడ్డీ రేట్లను వెల్లడించనుంది. ఆర్‌బీఐ కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని.. ద్రవ్య విధాన కమిటీ ఫిబ్రవరి 4 నుంచి కీలక చర్చలను నిర్వహించనుంది. మల్హోత్రా కీలక రేట్లలోని మార్పును ఫిబ్రవరి 7న ప్రకటించనున్నారు. ప్రస్తుతం అందరి చూపు దీనిపైనే ఉంది. ఆ రోజు %దీూ% రేటు తగ్గే సూచనలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అంటే బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు ప్రస్తుతం ఉన్న 6.5 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గే అవకాశం ఉంది.

శక్తికాంత దాస్ పదవీ విరమణ తరువాత.. సంజయ్ మల్హోత్రా ఆర్‌బీఐ గవర్నర్ బాధ్యతలు స్వీకరించారు. మల్హోత్రా బాధ్యతలు స్వీకరించిన తరువాత జరగనున్న మొదటి ఎంపీసీ అవుతుంది. రేటు తగ్గింపు గురించి చాలా అంచనాలు ఉన్నప్పటికీ, సెంట్రల్ బ్యాంక్ పెంచడానికి క్లిష్టమైన చర్యలు తీసుకుంటోంది. ఓఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ చర్చలు ఫిబ్రవరి 4 నుంచి 7 మధ్య జరగనున్నాయి. రెపో రేటుకు సంబంధించి అధికారిక ప్రకటన ఫిబ్రవరి 7 ఉదయం 10:00 గంటలకు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## ఆర్థిక మంత్రి చెప్పకముందే..

# బడ్జెట్ బయటికొచ్చేసిన వేళ..

బడ్జెట్ అంటే కేవలం ఆదాయం, వ్యయం లెక్కలే కాదు.. వేటి ధరలు తగ్గబోతున్నాయి? ఏవి పెరగబోతున్నాయి? పన్నులేమైనా తగ్గిస్తారా, పెంచుతారా? కొత్తగా వచ్చే ప్రయోజనాలేంటన్న ఆసక్తి అందరిలో ఉంటుంది. కేంద్ర ఆర్థిక మంత్రి పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టేదాకా ఇవన్నీ రహస్యమే. ఎందుకంటే ముందే బడ్జెట్ ప్రతిపాదనలు బయటికి తెలిస్తే... చాలా తేడాలు వచ్చేస్తాయి.



ధరలు పెరిగిపోయేవి ముందే కొని దాచేసుకోవడం, తగ్గిపోయేవాటిని మార్కెట్లోకి వదిలేయడం, స్టాక్ మార్కెట్లలో కంపెనీల షేర్ల కొనుగోళ్లు, అమ్మకాలు.. ఇలా మరెన్నో. కొన్నిసార్లు మోసాలకూ, అవకతవకలకూ చాన్స్ ఉంటుంది. ఇలా మన దేశ బడ్జెట్ ఓసారి ముందే లీకై, కేంద్ర ఆర్థిక మంత్రి రాజీనామాకు దారి తీయడంతోపాటు... బడ్జెట్‌కు రూపకల్పన చేసే ప్రక్రియనే మార్చేసింది తెలుసా? అది 1950వ సంవత్సరం.. జాన్ మథాయ్ కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్నారు. ఆయన, వివిధ శాఖల ఉన్నతాధికారులు కూర్చుని కేంద్ర బడ్జెట్ రూపకల్పన పూర్తిచేశారు. ప్రింట్ చేసి పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టడమే తరువాయి. అప్పట్లో రాష్ట్రపతిభవన్‌లోని ప్రెస్‌లో బడ్జెట్ ప్రతులను ముద్రించేవారు. ఇప్పుడున్నంత కఠినంగా సెక్యూరిటీ ఉండేది కాదు. దీనితో బడ్జెట్ పత్రాలు లీకయ్యాయి. రాష్ట్రపతి భవన్‌కు వెళ్లిన కొందరు జర్నలిస్టుల చేతికి చిక్కాయి. జాన్ మథాయి పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టేలోపే జనానికి అందులోని అంశాలు తెలిసిపోయాయి. ధనికులు, పెద్దలకు ప్రయోజనం కలిగించేలా బడ్జెట్ ఉందన్న విమర్శలు చెలరేగాయి. ఈ దెబ్బకు బడ్జెట్ పత్రాల ప్రింటింగ్‌ను ఢిల్లీలోని మింటో రోడ్‌లో ఉన్న ప్రభుత్వ ప్రెస్‌కు మార్చారు. తర్వాత 1980లో కేంద్ర సెక్రటేరియట్ ఉన్న నార్త్ బ్లాక్ భవనంలోని బేస్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రింటింగ్‌లో ముద్రించడం ప్రారంభించారు.

# ఐదేళ్ల తర్వాత సిద్ధూ సినిమా




సిద్ధూ జొన్నలగడ్డ హీరోగా నటించిన 'కృష్ణ అండ్ హిజ్ లీలా' సినిమా ఫబ్రవరి 14న థియేటర్‌లో విడుదల కానుంది. కరోనా కారణంగా 2020లో ఆహా, నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా విడుదలైన ఈ చిత్రం యూత్‌ను బాగా ఆకట్టుకుంది. 'క్షణం' సినిమాతో టాలీవుడ్‌లో సెన్సేషన్ క్రియేట్ చేసిన దర్శకుడు రవికాంత్ పేరపు ఈ యూత్‌ఫుల్ చిత్రాన్ని తెరకెక్కించాడు. సురేష్ ప్రొడక్షన్స్, వయకామ్ 18, సంజయ్ రెడ్డి సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో శ్రద్ధా శ్రీనాథ్, సీరత్ కపూర్, షాలినీ వందికట్టి హీరోయిన్లుగా నటించారు.

ఈ సినిమా విడుదల సమయంలో హీరో రానా దగ్గుబాటి సోషల్‌మీడియా వేదికగా ప్రమోషన్స్ చేశారు. ఇప్పుడు థియేటర్స్‌లో విడుదల సందర్భంగా ఆయన మరోసారి ఈ చిత్రాన్ని ప్రమోట్ చేస్తున్నారు. తన సోషల్‌మీడియాలో ఒక ఫన్నీ వీడియోతో సినిమా విడుదల తేదీని ప్రకటించారు. అయితే, ఈసారి 'ఇట్స్ కాంప్లికేటెడ్' పేరుతో ఫిబ్రవరి 14 ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.




# రాగ్ మయూర్ డబుల్ హిట్.. ఒకే రోజు వెబ్ సిరీస్, మూవీ రిలీజ్!

సినిమా బండి మూవీతో హీరోగా మారిన రాగ్ మయూర్ ఇటీవలే వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకొచ్చారు. సివరపల్లి అనే వెబ్ సిరీస్‌లో హీరోగా నటించారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి పాత్రలో మెరిశారు. 'పంచాయత్' అనే హిందీ వెబ్ సిరీస్ ఆధారంగా చేసుకుని తెరకెక్కించిన ఈ సిరీస్‌కు ఆడియన్స్ అదిరిపోయే రెస్పాన్స్ వస్తోంది. అమెరికా వెళ్లి పెద్ద చదువులు చదవాలి అనుకునే ఒక ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అనుకోకుండా పంచాయతీ సెక్రటరీగా మారితే ఎలా ఉంటుందనే కోణంలో తెరెకెక్కించారు. తెలంగాణలోని ఓ పల్లెలో జరిగిన కథగా తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. ప్రస్తుతం ఈ వెబ్ సిరీస్ అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది.

అయితే అదే రోజు గాంధీ తాత చెట్టు అనే సినిమా రిలీజైంది. సుకుమాక్ కుమార్తె సుకృతి ప్రధాన పాత్రలో నటించిన గాంధీ తాత చెట్టు సినిమాలో ఒక ఇండస్ట్రియలిస్ట్ ఏజెంట్‌గా సతీష్ అనే పాత్రలో రాగ్ మయూర్ మరోసారి మెరిశాడు. నిజానికి అతనికి సినిమాలో ఉన్న స్క్రీన్ టైం తక్కువే అయినా తనదైన శైలిలో ఉన్న కాసేపు ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. ముఖ్యంగా క్లైమాక్స్ సీన్లో రాగ్ మయూర్ ఉండడంతో అది మరింత బాగా కలిసొచ్చింది. ఒకేరోజు రిలీజ్ అయిన గాంధీ తాత చెట్టు సినిమాతో పాటు సివరపల్లి వెబ్ సిరీస్ రెండిటికి మంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. మరోవైపు ఇలా భిన్నమైన పాత్రలు చేస్తూ తెలుగులో ఒక మంచి నటుడిగా స్థిరపడాలని భావిస్తున్న రాగ్ మయూర్.. ఇప్పటికే గీత ఆర్ట్స్2 లో ఒక పేరు పెట్టని సినిమాతో పాటు పరదా, అలాగే గరివిడి లక్ష్మి సినిమాలో కూడా నటిస్తున్నాడు. 'సివరపల్లి' వెబ్ సిరీస్, గాంధీ తాత చెట్టు సినిమాలో విలన్‌గా రెండు భిన్న పాత్రలతో ఒకేరోజు ప్రేక్షకులు ముందుకు వచ్చిన రాగ్ మయూర్ బాలీవుడ్ హీరో రాజ్ కుమార్ రావు, మలయాళ హీరో ఫహద్ ఫాజిల్ బాటలో దూసుకెళ్తున్నాడు. చదువులో స్టేట్ టాపర్ అయిన రాగ్ మయూర్ ప్రశాంతంగా చదువు పూర్తి చేసి తర్వాత నటన మీద శ్రద్ధ పెట్టాడు.. సినిమాల గురించి రివ్యూస్ రాసే స్థాయి నుంచి ఈరోజు అదే రివ్యూలలో తన గురించి రాయించుకునే స్థాయికి నటనతో ఎదిగి ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. రాగ్ మయూర్ మొదటి సినిమా సినిమా బండిలో మరిడేష్ బాబు అనే పాత్రతో మెరిశాడు. ఆ పాత్రలో రాగ్ మయూర్ నటనతో సినిమా సక్సెస్ కావడంలో కీలక పాత్ర పోషించాయి. ఇక ఆ తర్వాత భిన్నమైన పాత్రలు ఎంచుకుంటూ వెళుతున్నాడు. భిన్నమైన జానర్ సినిమాలు చేస్తూ అందులో భాగంగానే కీడా కోలా అనే సినిమాలో లాయర్‌గా, బ్రహ్మానందం మనవడి పాత్రలో ఆకట్టుకున్నాడు. ఆ తర్వాత వచ్చిన వీరాంజనేయులు విహారయాత్రలో కూడా ఒక స్టార్టప్ మొదలు పెట్టాలని పరితపించే సగటు కుర్రాడిగా ఆకట్టుకున్నాడు. అతని పాత్రల ఎంపిక చూస్తే ఏ ఒక్క దానికి మరో పాత్రకి సంబంధం ఉండదు.




# కన్నప్పలో 'రుద్ర'గా ప్రభాస్..

మంచు విష్ణు ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ కన్నప్ప నుంచి ప్రభాస్ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ రివీల్ చేశారు. ఈ చిత్రంలో శివుడి పరమ భక్తుడు కన్నప్ప పాత్రలో విష్ణు నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే, 'రుద్ర' పాత్రలో ప్రభాస్ కనిపిస్తారని తాజా పోస్టర్‌తో మేకర్స్ తెలిపారు. ముకేశ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా రేంజ్‌లో ఏప్రిల్ 25 విడుదల చేయనున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ లుక్ ఎలా ఉంటుందోనని ఆయన అభిమానులు ఆసక్తిగా ఎదురుచూశారు. ప్రళయ కాల రుద్రుడు..! త్రికాల మార్గదర్శకుడు..!! శివాజ్ఞ పరిపాలకుడు..!!! అంటూ కన్నప్ప టీమ్ విడుదల చేసిన ప్రభాస్ రుద్ర గెటప్ అదిరిపోయిందని ప్రశంసలు వస్తున్నాయి. మొదట కన్నప్ప సినిమాలో శివుడి పాత్ర చేయాలని ప్రభాస్‌నే కోరారు మంచు విష్ణు.., అందుకు ప్రభాస్ నిరాకరించి మరో పాత్ర ఉంటే చెప్పు చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది. కన్నప్పలో ప్రభాస్ పాత్ర ఏంటి అంటూ పెద్ద చర్చే నడిచింది. వాటికి ఫుల్‌స్టాప్ పెడుతూ.. రుద్రగా ప్రభాస్ కనిపిస్తారని కన్నప్ప టీమ్ ప్రకటించింది. కన్నప్పలో శివుడిగా బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్ నటిస్తున్న విషయం తెలిసిందే. మంచు విష్ణు కలల ప్రాజెక్టుగా రూపొందుతోన్న చిత్రం 'కన్నప్ప'. 'మహాభారత్' సిరీస్ ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్‌లపై మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ మూవీలో ప్రభాస్, మోహన్ బాబు, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం, ప్రీతి ముకుందన్, కాజల్ అగర్వాల్ వంటి వారు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.



# అవకాశం ఇస్తామంటూ తిప్పించుకున్నారు -నిధి అగర్వాల్

సినిమా రంగం ఓ రంగుల ప్రపంచం. ఇక్కడ రాణించాలని చాలా మంది కలలు కంటారు. అయితే కొందరు మాత్రమే ఆ కల నెరవేర్చుకుంటారు. మరికొంత మందికి నటించాలని ఉన్నా..అవకాశాలు రావు. ఒక్క చాన్స్ కోసం ఎన్నో రోజులు వేచి చూస్తారు. అవకాశం వచ్చినప్పుడే తమ టాలెంట్‌ని నిరూపించుకుంటారు. ఆ తర్వాత దర్శకనిర్మాతలే వారి ఇళ్ల చుట్టు తిరుగుతారు. కానీ మొదట వచ్చే ఆ ఒక్క చాన్స్ కోసం కొంతమంది ఎన్నో కష్టాలు పడతారు. ఎన్నో అవమానాలను, మోసాలను భరించి.. తమ కలను నెరవేర్చుకుంటారు. అలా తాను కూడా తొలి సినిమా కోసం చాలా కష్టాలు పడ్డానని అంటోంది అందాల తార నిధి అగర్వాల్. దాదాపు రెండేళ్ల పాటు ఆఫీసుల చుట్టు తిరిగితే కానీ తనకు అవకాశం రాలేదని చెబుతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో నిధి తన సినిమా కష్టాల గురించి వివరించింది.నేను సినిమాల్లోకి రావడానికి కారణం దీపికా పదుకొణె. ఆమెను ఇన్స్పిరేషన్‌గా తీసుకొనే ఇండస్ట్రీలోకి వచ్చా. తెరపై దీపికను చూసి..నేను కూడా హీరోయిన్ అవుతానని ఇంట్లో చెప్పాను. మొదట్లో ఇంట్లో వాళ్లు ఒప్పుకోలేదు. ముందు చదువు పూర్తి చెయ్.. ఆ తర్వాత ఆలోచిద్దాం అన్నారు. కొన్నాళ్ల తర్వాత సినిమాలపై నాకున్న పిచ్చి చూసి..మా నాన్నగారే ప్రోత్సహించారు. హీరోయిన్‌గా ట్రై చెయ్ అని చెప్పారు. అలా ఇంట్లోవాళ్ల అనుమతితో ఇండస్ట్రీలోకి వచ్చాను. సినిమా చాన్స్‌లు ఈజీగా వస్తాయని అందరూ అనుకుంటారు. కానీ ఒక్క చాన్స్ రావడం అంత ఈజీ కాదు. నేను అయితే దాదాపు రెండేళ్ల పాటు అవకాశాల కోసం ఆఫీసుల చుట్టు తిరిగాను. ఎవరూ అవకాశం ఇవ్వలేదు. కొంతమంది దర్శక నిర్మాతలు అవకాశం ఇస్తామని చెప్పి మోసం చేశారు. రెండు మూడు సార్లు ఆఫీసుల చుట్టు తిప్పించుకొని..ఆ తర్వాత మీకు అవకాశం లేదని బయటకు పంపించేశారు. చివరిగా మైఖేల్ మున్నా సినిమా ఆడిషన్‌కి వెళ్తే.. అక్కడ నేను సెలెక్ట్ అయ్యాను. దాదాపు 300 మందిని ఆడిషన్ చేయగా.. అదృష్టం కొద్ది నేను సెలెక్ట్ అయ్యాడు. ఆ సినిమా చూసి నాకు నాగ చైతన్య 'సవ్యసాచి'లో చాన్స్ వచ్చింది. ఈ మధ్యకాలంలో నేను సినిమాలు తగ్గించాను అని చాలా మంది అంటున్నారు. అది వాస్తవమే. కానీ అవకాశాలు రాలేక కాదు.. ఓ ఒప్పందం కారణంగా సినిమాలు చేయట్లేదు. పవన్ కల్యాణ్ నటిస్తోన్న హరిహర వీరమల్లు సినిమాలో నన్ను హీరోయిన్‌గా సెలెక్ట్ చేశారు. అయితే ఆ సినిమా పూర్తయ్యేవరకు ఇతర చిత్రాల్లో నటించకూడదని నాతో అగ్రిమెంట్ చేసుకున్నారు. కరోనాతో పాటు ఇతర కారణాల వల్ల ఆ సినిమా వాయిదా పడింది. అదే సమయంలో నాకు ది రాజా సాబ్ మూవీలో అవకాశం వచ్చింది. దాంతో హరిహర వీరమల్లు మేకర్స్ ని ఆ సినిమాలో చేస్తాను అని అడగగా వాళ్ళు ఓకే చేశారు. ఈ రెండు చిత్రాలు నా కెరీర్‌కి చాలా స్పెషల్ అని నిధి అగర్వాల్ చెప్పుకొచ్చింది.

# సందీప్ రెడ్డి వంగా చిత్రంలో సాయి పల్లవి.. కానీ..?

అక్కినేని నాగ చైతన్య , సాయి పల్లవి జంటగా నటించిన 'తండేల్' చిత్రం ఫిబ్రవరి 7న గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధం అవుతోంది. ఈ సందర్భంగా తండేల్ జాతర పేరుతో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా స్పెషల్ గెస్ట్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొంతమంది యాక్టర్‌లను చూసిన వెంటనే ఇష్టం కలుగుతుంది. వారితో పరిచయం లేకపోయినా



వాళ్ళని ప్రత్యేకంగా ఇష్టపడతాం. నేను కేడి చిత్ర షూటింగ్ సమయంలో నాగ చైతన్యని తొలిసారి చూశాను. అప్పటి నుంచే చైతు అంటే నాకు చాలా ఇష్టం అన్నారు. ఇక సాయి పల్లవి గురించి మాట్లాడుతూ.. ప్రేమమ్ చిత్రం దగ్గర నుంచి సాయి పల్లవి నటన అంటే నాకు ఇష్టం. నా అర్జున్ రెడ్డి చిత్రం మొదట తనని హీరోయిన్‌గా తీసుకోవాలని అనుకున్నాను. కేరళలో సాయి పల్లవిని అప్రోచ్ కావాలని ఒక వ్యక్తిని అడిగాను. అతను స్టోరి ఎంటని అడిగితే లవ్ డెస్ట్రాయ్ అయిన వ్యక్తి స్టోరి అని, ఇది చాలా రొమాంటిక్ మూవీ అని చెప్పా. దానికి సమాధానంగా అతడు వెంటనే.. సార్ ఆ అమ్మాయి గురించి మీరు మరచిపోండి. ఎందుకంటే సాయి పల్లవి కనీసం స్లీవ్ లెస్ డ్రెస్ కూడా వేసుకోదు అని తనతో చెప్పినట్లు సందీప్ రెడ్డి తెలిపారు. ఇండస్ట్రీలో కొంతమంది హీరోయిన్లు ఒక పెద్ద ఆఫర్ వస్తే గ్లామర్ రోల్స్ చేద్దాం అని అనుకుంటారు. మొదట్లో అలా ఉండి ఆ తర్వాత అవకాశాల కోసం మారిపోతారు. కానీ సాయి పల్లవి వచ్చి ఇన్నేళ్లైనా ఆమె మాత్రం మారలేదు.



# రాజస్థాన్ రాయల్స్‌కు బిగ్ షాక్.. సంజూ శాంసన్‌కు గాయం..?

ఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభానికి ముందు రాజస్థాన్ రాయల్స్‌కు భారీ షాక్ తగిలింది. ఆ జట్టు కెప్టెన్ సంజూ శాంసన్ గాయపడినట్లు సమాచారం. ఇంగ్లండ్‌తో ఐదో టీ20 సందర్భంగా సంజూ చూపుడు వేలికి గాయమైనట్లు తెలుస్తుంది. బ్యాటింగ్ చేస్తున్న సమయంలో జోఫ్రా ఆర్చర్ సంధించిన బంతి సంజూ చూపుడు వేలుపై బలంగా తాకింది. ఈ సందర్భంగా సంజూ చాలా అసౌకర్యంగా కనిపించాడు.

ఆతర్వాత సంజూ బ్యాటింగ్‌ను కొనసాగించినప్పటికీ.. కొద్ది సేపటికే ఔటయ్యాడు. అనంతరం ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో సంజూ బరిలోకి దిగలేదు. అతని స్థానంలో ధ్రువ్ జురెల్ వికెట్‌కీపింగ్ చేశాడు. పలు నివేదికల ప్రకారం.. సంజూ రానున్న ఆరు వారాలు క్రికెట్‌కు దూరంగా ఉంటాడని తెలుస్తుంది.

దీంతో సంజూ ఐపీఎల్ ప్రారంభ మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశం ఉంది. గాయం కారణంగా సంజూ రంజీ బరిలో ఉండడని సమాచారం. రంజీలో సంజూ ప్రాతినిథ్యం వహించే కేరళ, క్వార్టర్ ఫైనల్లో జమ్మూ అండ్ కశ్మీర్‌తో తలపడాల్సి ఉంది. ఇంగ్లండ్‌తో చివరి టీ20లో బ్యాటింగ్ చేస్తూ గాయపడిన సంజూ.. ఆతర్వాత స్కానింగ్‌కు వెళ్లలేదు. డగౌట్‌లో ఎక్స్‌ట్రా ప్లేయర్ జెర్సీ వేసుకుని కనిపించాడు. దీన్ని చూసి అభిమానులు సంజూకు ఏమీ కాలేదని ఊపిరి పీల్చుకున్నారు. అయితే మ్యాచ్ అనంతరం సంజూ చూపుడు వేలుకు బాగా వాపు వచ్చినట్లు తెలుస్తుంది. అప్పుడు స్కానింగ్‌కు వెళ్లగా డాక్టర్లు ఫ్రాక్చర్‌ను గుర్తించినట్లు సమాచారం.

ఇదిలా ఉంటే, ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో సంజూ శాంసన్ ఘోరంగా విఫలమయ్యాడు. ఈ సిరీస్‌లో అతను కేవలం 51 పరుగులు (26,5,3,1,16) మాత్రమే చేశాడు. ఈ సిరీస్‌లో సంజూ షార్ట్ పిచ్ బంతులను ఎదుర్కోవడంలో చాలా ఇబ్బంది పడ్డాడు. ప్రతి మ్యాచ్‌లో ఒకే రీతిలో వికెట్ పారేసుకున్నాడు. షార్ట్ పిచ్ బంతులను ఎదుర్కోవడంలో సంజూ వీక్‌నెస్‌ను గుర్తించిన ఇంగ్లండ్ పేసర్లు పదేపదే ఒకే తరహా బంతులు వేసి అతన్ని ఔట్ చేశారు.

ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో సంజూ విఫలమైనప్పటికీ భారత్ 4-1 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఈ సిరీస్‌లో సంజూ సహచర ఓపెనర్ అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. చివరి టీ20లో విధ్వంసకర శతకం బాదిన అభిషేక్.. ఈ సిరీస్‌లో 5 మ్యాచ్‌ల్లో సెంచరీ, హాఫ్ సెంచరీ సాయంతో 219.69 స్ట్రయిక్‌రేట్‌తో 276 పరుగులు చేసి లీడింగ్ రన్ స్కోరర్‌గా నిలిచాడు.

ఐపీఎల్ 2025 సీజన్ మార్చి 21 నుంచి ప్రారంభం కానుంది. క్యాష్ రిచ్ లీగ్‌లో రాజస్థాన్ ఆరంభ ఎడిషన్‌లో మాత్రమే టైటిల్ సాధించింది. గత సీజన్‌లో సంజూ శాంసన్ నేతృత్వంలోని ఈ జట్టు రెండో క్వాలిఫయర్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఓటమిపాలైంది.

# గంభీర్‌కు అసలు పరీక్ష ఇప్పుడే!

ఇటీవల ఆస్ట్రేలియాలో జరిగిన గవాస్కర్-బోర్డర్ సిరీస్ అయిదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో ఘోరంగా పరాజయం చవిచూసిన భారత్ జట్టు తిరిగి గాడిలో పడటం శుభపరిణామం. ఇంగ్లండ్ వంటి ప్రధాన జట్టు పై 4-1 తేడాతో టీ20 సిరీస్ ను చేజిక్కించుకోవడం సానుకూలాంశం. కొత్త సంవత్సరంలో అదీ ఇంగ్లండ్‌పై పూర్తి స్థాయిలో ఆధిపత్యాన్ని ప్రదర్శించడం రాబోయే ఛాంపియన్స్ ట్రోఫీ టోర్నమెంట్‌కి ముందు జట్టులో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందనడంలో సందేహం లేదు.

ఈ సిరీస్‌కు ముందు భారత్ జట్టు ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదన్నది వాస్తవం. సొంత గడ్డపై 27 సంవత్సరాల తర్వాత శ్రీలంకతో జరిగిన ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను కోల్పోవడం భారత్ క్రికెట్ చరిత్రలో తొలిసారి. న్యూజిలాండ్ తో స్వదేశంలో జరిగిన టెస్ట్‌లో భారత్ జట్టు 12 సంవత్సరాల తర్వాత ఓటమి చవిచూసింది.

ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా పర్యటన లో జరిగిన గవాస్కర్-బోర్డర్ సిరీస్ అయిదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ భారత్ జట్టు 3-1 తేడాతో ఓటమి పాలయింది. ఈ సిరీస్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీల ఘోర వైఫల్యంతో వారిద్దరూ రిటైర్మెంట్ ప్రకటించనున్నారని, భారత్ జట్టు క్యాంప్ లో విభేదాలు తలెత్తాయని , కెప్టెన్ రోహిత్, కోచ్ గంభీర్ ఒకే పేజీలో లేరని విమర్శలు కూడా వచ్చాయి.

## టీ20ల్లో అద్భుతమైన ఫామ్

ఇదిలా ఉంటే.. గౌతమ్ గంభీర్ ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత టీ20 ఫార్మాట్ లో భారత్ అద్భుతమైన ఫామ్‌ను కనబరుస్తోంది. 2024 ప్రారంభం నుంచి భారత్ జట్టు 29 మ్యాచ్‌లలో కేవలం మూడు మ్యాచ్‌లలో మాత్రమే ఓటమి చవిచూసింది.

ఏదేమైనా.. గంభీర్ తన శైలిని మార్చుకోవడానికి ఇష్టపడడు. ఈ సిరీస్ అనంతరం మాట్లాడుతూ భారత్ జట్టుకి ఓడిపోతామనే భయం లేదు. మేము అధిక-రిస్క్, అధిక-రివార్డ్ క్రికెట్ ఆడతాం. ప్రతీసారి 250 పరుగులు చేయడం సాధ్యం కాదు. కొన్నిసార్లు 130 పరుగులకే ఔట్ అయ్యే ప్రమాదం ఉంది. కానీ దానికి మేము సిద్ధంగా ఉన్నాము" అని వ్యాఖ్యానించాడు.

## రోహిత్, కోహ్లీతో అభిప్రాయభేదాలు?

అయితే భారత్ టి20 ఫార్మాట్ రికార్డును అటుంచితే , వన్డే , టెస్ట్ ఫార్మాట్లలో భారత్ ప్రదర్శన ఆశించినంత స్థాయిలో లేదు. ఇక గురువారం నుంచి ఇంగ్లండ్ మూడు మ్యాచ్ల వన్డే సిరీస్ ప్రారంభమవుతుంది. త్వరలో జరుగనున్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఇంగ్లండ్‌తో జరిగే వన్డే సిరీస్ భారత్ కి ఎంతో కీలకం. ఇంగ్లండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్ కు కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ మళ్ళీ జట్టులోకి రానున్నారు. వన్డే క్రికెట్‌లో వారిద్దరికీ అపారమైన నైపుణ్యం ఉందని, గంభీర్ అన్నాడు. వారిద్దరితో ఆస్ట్రేలియా పర్యటన లో అభిప్రాయభేదాలు తలెత్తయన్న పుకార్లకు చెక్ పెడుతూ, "వారిద్దరు ఎంతో అనుభవం ఉన్నవారు. పరిస్థితులు సరిగా లేనప్పుడు డ్రెస్సింగ్ రూమ్ గురించి చాలా విషయాలు మాట్లాడుకుంటారు. కానీ ఫలితాలు మీకు అనుకూలంగా రావడం ప్రారంభించిన తర్వాత, విషయాలు సరిగ్గా జరగడం ప్రారంభిస్తాయి" అని గంభీర్ ఆ పుకార్లను కొట్టి పారేసాడు.




## అభిషేక్‌పై ప్రశంసలు

కోచ్ గంభీర్ యువ ఓపెనర్ అభిషేక్ శర్మ సాధించిన సెంచరీ పై ప్రశంసలు కురిపించాడు."నేను ఇలాంటి టి20 సెంచరీని ఇంతవరకు చూడలేదు. జోఫ్రా ఆర్చర్, మార్క్ వుడ్ వంటి హేమాహేమీలైన బౌలర్లు ఎదుర్కొని అలా అలవోకగా షాట్ లు కొట్టడం సామాన్య విషయం కాదు. ఐపీఎల్ లో మీరు చాలా సెంచరీలు చూసి ఉండవచ్చు. కానీ ఇంగ్లండ్ వంటి జట్టు పై ఆ స్థాయి లో షాట్లు కొట్టి అభిషేక్ సెంచరీ సాధించాడు. అందుకే నేను చూసిన వాటిలో ఇది అత్యుత్తమైన టీ20 సెంచరీగా భావిస్తున్నాను" అని గంభీర్ వ్యాఖ్యానించాడు.




# ఛాంపియన్‌గా ప్రజ్ఞానంద

టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్-2025కు ఎండ్ కార్డ్ పడింది. ఈ టోర్నీ విజేతగా భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద నిలిచాడు. నెదర్లాండ్స్‌లోని విక్ ఆన్ జీ వేదికగా జరిగిన టై బ్రేకర్‌లో వరల్డ్ ఛాంపియన్ డి గుకేశ్‌పై ప్రజ్ఞానంద విజయం సాధించాడు. కాగా అంతకుముందు చివరి రౌండ్‌లో గుకేశ్, ప్రజ్ఞానానంద ఇద్దరూ తమ మ్యాచ్‌లలో ఓటమి చవిచూశారు.జర్మన్ గ్రాండ్ మాస్టర్ జీఎమ్ విన్సెంట్ ప్రగ్నందందాను ఓడించగా.. గుకేష్‌ను అర్జున్ ఎరిగైసి ఖంగుతిన్పించాడు. దీంతో 8.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్న గుకేశ్, ప్రజ్ఞానంద.. టైటిల్ కోసం టైబ్రేకర్‌లో తలపడ్డారు. టైబ్రేకర్‌లో తొలి గేమ్‌లో గుకేష్ విజయం సాధించగా, రెండో గేమ్‌లో ప్రజ్ఞానంద గెలుపొందాడు.ఫలితంగా విజేతను తేల్చేందుకు సడన్ డెత్ నిర్వహించాల్సి వచ్చింది. ఇందులో ప్రజ్ఞానంద విజయం సాధించి టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ టోర్నీ చివరి రౌండ్(13వ రౌండ్)లో ప్రజ్ఞానంద 2741 పాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా.. దొమ్మరాజు గుకేశ్(2777) రెండో స్థానంలో నిలిచాడు.

# అభిషేక్...అమోఘం.. సిక్సర్లతో వాంఖెడే అభిషేకం

ఇన్నింగ్స్ తొలి బంతికే సామ్సన్ సిక్స్‌తో భారత్ ఆట ఆరంభం. మూడో ఓవర్లో బౌండరీతో అభిషేక్ ధాటి కాస్త ఆలస్యం! అంతే ఇక ఆ ఓవర్లోనే రెండు సిక్స్‌లతో పదునెక్కిన ప్రతాపం. ఆర్చర్, మార్క్ వుడ్, ఓవర్టన్ ఇలా పేసర్లు మారినా... లివింగ్‌స్టోన్, రషీద్‌లు స్పిన్నేసినా... బంతి గమ్యం, అభిషేక్ వీరవిహారం... ఈ రెండూ ఏమాత్రం మారలేదు. 13 సిక్సర్లతో 'వాంఖెడే'కు అభిషేకం... 37 బంతుల్లోనే శతకం... 18వ ఓవర్ దాకా అతనొక్కడిదే విధ్వంసం!

ఆఖరి పోరు గెలిచి ఆతిథ్య దేశం ఆధిక్యానికి గండి కొట్టేద్దామనుకుంటే ఇంగ్లండ్ కనీసం జట్టంతా కలిపి 100 పరుగులైనా కొట్టలేకపోయింది. ప్రత్యర్థి పేస్, స్పిన్ వైవిధ్యం అభిషేక్ శర్మ ధాటిని ఏ ఓవర్లోనూ, ఏ బౌలింగ్‌తోనూ అసలు ప్రభావమే చూపలేకపోయింది.

ముంబై: ఏఐ... అదేనండీ అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైపే ఇప్పుడు ప్రపంచం చూస్తోంది. కానీ వాంఖెడే స్టేడియంలో మాత్రం మరో ఏఐ... అదే భయ్యా అభిషేక్ ఇంటలిజెంట్ బ్యాటింగ్ వైపే ఓ గంటసేపు కన్నార్పకుండా చూసేలా చేసింది. ఇది కదా ఫన్... ధన్ ధనాధన్! ఇదే కదా ఈ టి20 ద్వైపాక్షిక సిరీస్‌లో గత నాలుగు మ్యాచ్‌ల్లోనూ మిస్సయ్యింది. అయితేనే ఆఖరి పోరులో ఆవిష్కృతమైంది.



అభిషేక్ శర్మ (54 బంతుల్లో 135బీ 7 ఫోర్లు, 13 సిక్స్‌లు) ఆమోఘ శతకం, అదేపనిగా విధ్వంసం ముంబై వాసుల్ని మురిపించింది. టీవీ, మొబైల్ యాప్‌లలో యావత్ భారత అభిమానుల్ని కేరింతలతో ముంచెత్తింది. అతని ఆటలో అయ్యో ఈ షాట్‌ను చూడటం మిస్ అయ్యామే అని బహుశా ఏ ఒక్కరికీ అనిపించి ఉండకపోవచ్చు! ఎందుకంటే ప్రతి షాట్ హైలైట్స్‌నే తలదన్నేలా ఉంది. ఆదివారం అసలైన టి20 వినోదాన్ని పంచిన చివరి టి20లో భారత్ 150 పరుగుల భారీ తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 4%-%1తో సొంతం చేసుకుంది. మొదట భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లను కోల్పోయి 247 పరుగుల భారీస్కోరు చేసింది. శివమ్ దూబే (13 బంతుల్లో 30బీ 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఉన్న కాసేపు మెరిపించాడు. బ్రైడన్ కార్స్ 3, మార్క్‌వుడ్ 2 వికెట్లు తీశారు. తర్వాత కష్టమైన లక్ష్యం ఛేదించేందుకు దిగిన ఇంగ్లండ్ 10.3 ఓవర్లలోనే 97 పరుగుల వద్దే ఆలౌటైంది.

ఓపెనర్ ఫిల్ సాల్ట్ (23 బంతుల్లో 55బీ 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) బాదిన అర్ధశతకంతో ఆ మాత్రం స్కోరు చేసింది. మిగతావారిలో జాకబ్ బెథెల్ (10బీ 1 సిక్స్) తప్ప అందరివి సింగిల్ డిజిట్లే! షమీ 3 వికెట్లు పడగొడితే ఒక్క ఓవర్ వేసిన అభిషేక్, దూబే, వరుణ్‌లు తలా 2 వికెట్లు తీసి ఇంగ్లండ్‌ను 11వ ఓవర్ ముగియక ముందే స్పిన్‌తో దున్నేశారు.

అంతర్జాతీయ౼ టీ20 ఫార్మాట్లో తనకు తిరుగులేదని టీమిండియా మరోసారి నిరూపించుకుంది. ఇంగ్లండ్‌తో ఐదో టీ20లో భారీ తేడాతో గెలుపొంది.. ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకుంది. టెస్టు హోదా కలిగిన జట్లలో ఇంత వరకు.. ఏ టీమ్‌కీ సాధ్యం కాని రీతిలో 'బిగ్గెస్ట్ విక్టరీ'ల విషయంలో అత్యంత అరుదైన ఘనత సాధించింది. కాగా సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ 4-1తో కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. కోల్‌కతాలో విజయంతో ఈ సిరీస్ ఆరంభించిన టీమిండియా.. చెన్నైలోనూ గెలిచింది. అయితే, ఆ తర్వాత రాజ్‌కోట్‌లో జరిగిన మూడో టీ20లో మాత్రం ఓటమిపాలైంది. ఏకపక్ష విజయం అయితే, ఎ డిలేచిన కెరటంలా పుణె వేదికగా మరోసారి సత్తా చాటి.. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ సొంతం చేసుకుంది.